క్లుప్తంగా

రేపు జగనన్నకు చెబుదాం కార్యక్రమం

వినుకొండ(నూజెండ్ల): జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా మండలస్థాయి స్పందన కార్యక్రమం నూజెండ్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాలనందు ఈ నెల 13వ తేదీ ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వీరభద్రాచారి, తహసీల్దార్ మధుబాబులు తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొంటారని మండలంలోని గ్రామాల్లో ఉన్న ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



బొల్లాపల్లి: మండలంలోని మేళ్ళవాగు గ్రామంలో బుధవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడులో ప్రజాపంపిణీ బియ్యం పట్టుబడింది. పౌరసరఫరాల డిప్యూటీ లక్ష్మణరావు వై.లక్ష్మణరావు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామంలో సచివాలయం పక్కనే ఉన్న రేకుల షెడ్‌లో ప్రజా పంపిణీ బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడిలో 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనపరచుకున్నారు. గ్రామానికి చెందిన బి.కృష్ణారెడ్డి షెడ్‌లో రేషన్ బియ్యం నిల్వ ఉందని, ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈ రేషన్ బియ్యం సుమారు రూ.87500 విలువ ఉంటుందని సీఎస్‌డీటీ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ శ్రీహరి, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

తపాలా కార్యాలయంలో క్విజ్ పోటీలు



నరసరావుపేట: జాతీయ తపాలా దినోత్సవంలో భాగంగా డివిజన్ హెడ్ పోస్టాఫీసు కార్యాలయంలో బుధవారం విద్యార్థులకు నిర్వహించిన ఫిలాట్లిడే క్విజ్ పోటీల్లో భాష్యం స్కూలు విద్యార్థులు ప్రథమ బహుమతి దక్కించుకున్నారు. ద్వితీయ, తృతీయ బహుమతులను తిలక్‌స్కూలు, నారాయణ స్కూలు విద్యార్థులు గెల్చుకున్నారు. బహుమతులను పోస్టల్ సూపరిండెంట్ పి.వెంకట స్వామి అందజేశారు. పోస్టల్ సేవలు, ఆవశ్యకత గురించి ప్రజలకు తెలియచేయాల్సిన అవసరం ఉందన్నారు. కేర్ స్కూలు, హిందూ స్కూలు విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం గ్రామంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన దప్పిలి రామోహనరెడ్డి, శ్రీలక్ష్మీ దంపతులు రూ.50,058 విరాళంగా అందజేసారు. ఆలయ కార్యాలయంలో బుధవారం ఈఓ టి.సుధాకరరెడ్డిని కలిసి విరాళం చెక్‌ను దాతలు అందించారు. తన తండ్రి దప్పిలి వెంగళరెడ్డి జ్ఞాపకార్థం విరాలాన్ని అందజేసినట్లు దాత రామోహనరెడ్డి తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న ఆలయ పునర్నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేసి సహకరించాలని ఈఓ సుధాకరరెడ్డి కోరారు.

ప్రతి గురువారం అర్చక గ్రీవెన్స్‌డే

నరసరావుపేట ఈస్ట్ : జిల్లా పరిధిలోని అర్చకుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి గురువారం ఇస్సప్పాలెం శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయం వద్దనున్న జిల్లా దేవదాయశాఖ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహిస్తామని దేవదాయశాఖ జిల్లా అధికారి టి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆలయ కల్యాణమండపంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో అర్చకుల సమస్యలపై గ్రీవెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా దేవదాయ శాఖ అధికారి సత్యనారాయణరెడ్డి అర్చకుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక నుంచి ప్రతి గురువారం అర్చకులు నేరుగా తమ కార్యాలయానికి రావచ్చని తెలిపారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు టి.మురళీ, వివిధ ఆలయాల అధికారులు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

15 నుంచి దసరా వేడుకలు



శావల్యాపురం: మండల కేంద్రంలో వేంచేసియున్న కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు ఈనెల 15 నుంచి 23 వరకు నిర్వహిస్తున్నట్లు దేవాలయ ఆలయ ధర్మకర్త రెడ్డి జ్వాలా నరసింహారావు బుధవారం తెలిపారు. గ్రామస్తులు దాతలు సహకారంతో జరిగే ఈ ఉత్సవాల్లో ఆలయ అర్చకులు రావిపాటి సాయిభరత్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు, పూజలు నిర్వహిస్తారన్నారు. రాత్రి సమయంలో దేవాలయం ప్రాంగణంలో భక్తి బృందంచే భజనలు అనంతరం మహిళ భక్తులకు ప్రోత్సాహక బహుమతులు అందచేస్తామన్నారు.



ములకలూరు సురక్ష శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



ములకలూరులో వృద్ధురాలికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు



సొలసలో వైద్యపరీక్షలు చేస్తున్న స్పెషలిస్టు డాక్టర్ దీపిక



సొలస క్యాంపులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ గోపీనాయక్



విప్పర్లపల్లిలో రోగులకు పరీక్షలు చేస్తున్న మహిళా డాక్టర్

ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- ములకలూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం
- 573మందికి వైద్య పరీక్షలు

నరసరావుపేట రూరల్: ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యతగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని ములకలూరు సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ సీఎం జగన్ వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఈ కార్యక్రమం ద్వారా వైద్య సేవలు అందుతాయని తెలిపారు. ఈ శిబిరంలో ఏడు రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులను ఉచితంగా అందజేస్తారన్నారు.

వైద్య శిబిరంలో ప్రత్యేక విభాగాలకు చెందిన వైద్యులు కూడా అందుబాటులో ఉంటారని తెలిపారు. వైద్యులు అందుబాటులో లేకుండా వారికి ప్రైవేటు ఆసుపత్రిలో ఉచితంగా చికిత్సలు అందించేలా వైద్య సిబ్బందికి సహకారం అందిస్తారని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వైద్య శిబిరానికి 573 మంది హాజరుకాగా 246 మంది మహిళలు, 327మంది పురుషులు, 8 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 115 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 57 మందికి కళ్లజోళ్లు అవసరమని సూచించారు. వైద్య శిబిరంలో తహసీల్దార్ రమణానాయక్, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి నాని, గ్రామ సర్పంచ్ జెత్రిపోతు మేరిరత్నకుమారి, ఎంపీటీసీ సయ్యద్ మస్తాన్ వలి పాల్గొన్నారు. డాక్టర్ జోయల్ ప్రసాద్, డాక్టర్ మమత, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ జోత్స్న, జి.గ్రేస్ తదితరులు వైద్య సేవలు అందించారు.



ములకలూరులో వైద్య శిబిరానికి హాజరైన గ్రామస్తులు

సొలస గ్రామంలో..

యడ్లపాడు: ప్రతివ్యక్తి ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆ కుటుంబం ఆర్థిక అభ్యున్నతిని సాధిస్తుందని భావించి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించినట్లు మాజీ ఎంపీపీ ఎంవీ బాలచంద్రారెడ్డి పేర్కొన్నారు. యడ్లపాడు మండలం సొలస జెడ్పీహైస్కూల్ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అధికారులు బుధవారం నిర్వహించారు. ఈ శిబిరంలో యడ్లపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్ గోపీనాయక్, స్పెషలిస్ట్ డాక్టర్లు దీపిక, సాయిఅవినాష్, షేక్ నజీర్, బి.ప్రతాప్‌కుమార్ పాల్గొన్నారు. సొలస, కొత్త సొలస గ్రామాలకు చెందిన 565 మంది ఓపీ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. వీరికి వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్సలు చేసి ఉచితంగా మందుల్ని పంపిణీ చేశారు. మెరుగైన పరీక్షలు, చికిత్సలు, సర్జరీలు అవసరమైన 33 మంది రోగుల్ని గుర్తించిన స్పెషలిస్టు డాక్టర్లు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి సిఫార్సు చేశారు. అలాగే ప్రత్యేక స్టాల్ ద్వారా 298 మందికి కంటి సంబంధిత పరీక్షల్ని నిర్వహించి మందులు అందించారు. కళ్లజోళ్లు అవసరమైన వారిని గుర్తించి నమోదు చేసుకున్నారు. జిల్లా కుష్ఠు, టీబీ, హెచ్ఐవీ/ఎయిడ్స్ అధికారులు రమణరావు బృందం సొలస గ్రామాన్ని సందర్శించారు. జేఏఎస్ శిబిరంలోని స్టాళ్లను పరిశీలించి ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకయ్య, ఎంపీటీసీ సభ్యులు ఎం శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్డీ డి.వరూధిని, సీహెచ్‌వో ఎస్ పున్నారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలూరి శ్రీనివాసరెడ్డి, మద్దూరి శ్రీనివాసరెడ్డి, సంజీవరెడ్డి, వేణుగోపాలరెడ్డి, వైఎస్సార్ యూత్ సభ్యులు, అంగన్‌వాడీ, ఆరోగ్య, ఆశవర్కర్లు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విప్పర్లపల్లి శిబిరంలో 363 మందికి వైద్యసేవలు

నరసరావుపేట: రొంపిచర్ల మండలంలోని విప్పర్లపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 363 మంది గ్రామస్తులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో జనరల్ సర్జన్ డాక్టర్ నందగోపాల్‌రెడ్డి, జనరల్ మెడిసిన్ వైద్యులు డాక్టర్ డింపుల్ ప్రత్యేక వైద్యులుగా హాజరై వైద్యసేవలు అందజేశారు. వీరితో పాటు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర డాక్టర్లు స్వాతి, మురళి వైద్యసేవల్లో పాల్గొన్నారు. శిబిరాన్ని గ్రామ సర్పంచు గాదే రామిరెడ్డి ప్రారంభించారు.

ములకలూరులో...

వినుకొండ(నూజెండ్ల): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నూజెండ్ల మండలంలోని ములకలూరు గ్రామంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో టి. వీరభద్రాచారి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు సక్రమంగా లభించక ఇబ్బందులు పడుతున్న పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నాణ్యమైన, సురక్షితమైన వైద్యం అందుతుందన్నారు. అనంతరం కళ్లజోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ డి.రవికుమార్, వైద్యులు జీఎం కొండయ్య, ఆర్. శ్రీనివాస్, దీపిక మంజూష, లక్ష్మీనారాయ, సీహెచ్‌వో విమల కుమారి, పీహెచ్ఎస్ జయకుమారి, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యర్తలు తదితరులు పాల్గొన్నారు.

పిచికలపాలెంలో...

శావల్యాపురం: మండలంలోని పిచికలపాలెం గ్రామసచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సారథ్యంలో ఎంపీయూపీ పాఠశాల ప్రాంగణంలో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 372 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచులు తిరివిది రమణారావు, పురేటి నాగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, ఆర్ఐ పి.నాసరయ్య, వైద్యాధికారులు రాధాకృష్ణన్, రాజశేఖర్, చాంద్‌బాష ఆరోగ్య ఆశ, పాల్గొన్నారు.



విప్పర్లపల్లి వైద్య శిబిరంలో పరీక్షలు పొంది గుర్తింపు కార్డులను చూపిస్తున్న గ్రామస్తులు



విప్పర్లపల్లిలో వైద్యపరీక్షలు చేయించుకున్న రోగులకు మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది



విప్పర్లపల్లి శిబిరంలో బీపీ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది



విప్పర్లపల్లి మహిళకు రక్తపరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది



ములకలూరు వైద్యశిబిరంలో కళ్లజోళ్లను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో వీరభద్రాచారి

క్రీడా వార్తలు

జిల్లాస్థాయి క్రీడాపోటీలకు సీతారామపురం విద్యార్థులు




వినుకొండ(నూజెండ్ల) : ఉమ్మడి గుంటూరు జిల్లా ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇటీవల వినుకొండ లయోలా పాఠశాలలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి జట్ల ఎంపిక పోటీల్లో నూజెండ్ల మండలం సీతారామపురం ఎస్‌వీఎస్‌సీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎస్. కామేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-14 బాలికల విభాగంలో కబడ్డీలో జీవీవీ హర్షిత, బాలుర విభాగం పరుగు పందెంలో వై.వీరయ్య, కబడ్డీలో వై.వీరయ్య, బి.ప్రవీణ్‌కుమార్, అండర్-17 బాలికల విభాగంలో కబడ్డీలో డి. శ్రావణి, జి. లక్ష్మీ ప్రసన్న, బాలుర కబడ్డీ విభాగంలో వై.వీర మల్లికార్జునలు జిల్లా పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు పీడీ విజయ్, ఉపాధ్యాయులు అభినందించారు.

ముగిసిన షూటింగ్ బాల్ పోటీలు



నాదెండ్ల: చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో షూటింగ్ బాల్ పోటీలు బుధవారంతో ముగిశాయి. అండర్-17 విభాగంలో బాలబాలికలకు విడివిడిగా పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయి జట్లను ఎంపిక చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వివిధ పాఠశాలల నుంచి వంద మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలు వివిధ పాఠశాలల మధ్య రసవత్తరంగా సాగాయి. బాలుర విభాగంలో అభినయ్, అనిల్, ఏసుబాబు, రోహిత్ జోషి, ప్రశాంత్, ఖాజా, నజీర్, మసూద్, మనోహర్, అభిలాష్, ఆనంద బాబు, స్టాండ్‌బై రణదీప్ కుమార్, జె.ప్రవీణ్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో వి.అవిల, బి.నాగలక్ష్మి, ఎం.అనూజ్ఞ, బి.మైథిలి, టి.కోకిల, డి. క్రాంతి, బి.అభినయశ్రీ, టి.సునీత, ఎం.సంజన, బి.అనువైష్ణవి, పి.షాహెద, స్టాండ్‌బై పి.కృష్ణవేణి, శైలజ, షేక్ జాస్మిన్ ఎంపికయ్యారు. వీరు త్వరలో రాష్ట్రస్థాయిలో అనంతపురంలో జరిగే పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు తరఫున ఆడనున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లవరపు సుందరరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు పఠాన్ ఖాదర్‌మస్తాన్, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ కన్వీనర్ షేక్ అచ్చేమియా, పీఈటీలు జాస్తి శ్రీకాంత్, షేక్ బాజీ, ఫిలిప్‌రాజు, అమీర్ హుస్సేన్, నాగమణి, షేక్ అశితున్, మండల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కన్వీనర్ కె వెంకట నాగరాజు ఉన్నారు.

పోట్లూరు హైస్కూలు విద్యార్థులు..



శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శింగంశెట్టి అన్నపూర్ణమ్మ బుధవారం తెలిపారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకరవర్గ క్రీడా పోటీల్లో జిల్లా స్థాయి పోటీలకు అండర్-14 విభాగంలో వాలీబాల్ రూపశ్రీ, ప్రణతి, దీపక, దీవ్య, లాంగ్‌జంప్‌లో ప్రణతి, అండర్-14 కబడ్డీ పోటీలో సాత్విక్, త్రోబాల్‌లో దివ్య, దీపక, యోగలో డి.మీరాబాబు మంచి ప్రతిభ కనపరిచినట్లు తెలిపారు. క్రీడాల్లో మంచి ప్రతిభ చూపిన విద్యార్థినులను పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ గడుపూడి రామారావు, వ్యాయామ ఉపాధ్యాయులు డి.మణి, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

సస్యరక్షణ చేపట్టాలి



పురుగుమందు పంపిణీ చేస్తున్న డాక్టర్ జి రమేష్

చిలకలూరిపేటటౌన్: పత్తిపంటలో గులాబీరంగు పురుగు నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాట్ సెంటర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.రమేష్ చెప్పారు. బుధవారం మండలంలోని లింగంగుంట్ల, కావూరు, గంగన్నపాలెం గ్రామాల్లో సాగుచేసిన పత్తిపంట పరిశీలించి ఆయన మాట్లాడుతూ అక్టోబర్ నెలలో గులాబీ రంగు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుందని, రైతులు పురుగు ఉనికిని గమనించి నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గులాబీరంగు పురుగు ఉనికిని తెలుసుకోవటానికి నాలుగు నుంచి 10 లింగార్షక బుట్టలు పెట్టుకోవాలని సూచించారు. వీటి ద్వారా ఉధృతిని తగ్గించుకోవచ్చన్నారు. పురుగును నాశనం చేసే ప్రొఫినోపాస్ 400 మిల్లీలీటర్లు లేదా క్లోరిఫైరీపాస్ 500 మిల్లీమీటర్ల మందును పిచికారి చేయా లని సూచించారు. వీటిని ఏడు రోజుల వ్యవధిలో రెండు లేదా మూడు సార్లు పిచికారి చేయాలన్నారు.

ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి



నరసరావుపేట రూరల్: ఈ-పంట నమోదు చేసుకున్న తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జె.బెన్ని తెలిపారు. మండలంలోని పమిడిమర్రు, కొండకావూరు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. మిరప, పసుపు తదితర పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ఆర్‌బీకేను సందర్శించారు. ఆర్‌బీకేలోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ-పంట నమోదు, ఈకేవైసీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి డి.నవీన్‌కుమార్, గ్రామ ఉద్యాన సహాయకులు ఆంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బంధువులకు మృతదేహాలు అప్పగింత

యడ్లపాడు: తిమ్మాపురం హైవేపై లూథరన్ చర్చి ఎదురుగా ఈనెల 9వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి చెందిన విషయం తెలిసిందే. వీరిలో తిమ్మాపురం ఎస్సీ కాలనీకు చెందిన జ్యోతి సునీత (40) మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టంకు తరలించారు. తలకు తీవ్రగాయాలైన పెదనందిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన జొన్నల గడ్డ మరియమ్మ (60)ను చిలకలూరిపేట ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్సలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరియమ్మ మృతి చెందింది. దీంతో వీరిద్దరి మృతదేహాలకు బుధవారం ఆయా ఆస్పత్రుల్లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు యడ్లపాడు ఎస్ఐ సురేష్ తెలిపారు. సాయంత్రం వారి స్వగ్రామాల్లో మృతులిద్దరికీ అంత్యక్రియల్ని నిర్వహించారు.

అక్రమంగా విద్యుత్ వినియోగించొద్దు

- హెచ్చరించిన సీఆర్‌డీఏ విజిలెన్స్
- యడ్లపాడు మండలంలో దాడులు

యడ్లపాడు: విద్యుత్ అక్రమ చౌర్యం లేదా అదనపు వినియోగం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఆర్‌డీఏ విజిలెన్స్ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు. యడ్లపాడు మండలంలో విద్యుత్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. గుంటూరు-2 పరిధిలో కొనసాగిన ఈ ఆపరేషన్‌ను ఎం.విజయ్‌కుమార్ నేతృత్వం వహించారు. మండలంలోని 23 గ్రామాల్లో 36 బృందాలుగా విభజించి 2,583 విద్యుత్ సర్వీసులను తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో విద్యుత్ అక్రమ చౌర్యం, అలాగే విద్యుత్ అదనపు లోడు వాడుతున్న 81 సర్వీసుల్ని అధికారులు గుర్తించి ఆయా సర్వీసుల యజమానులకు రూ.5,99,700 జరిమాన విధించారు. వీటిలో విద్యుత్ చౌర్యం చేస్తున్న వారు 18 మంది ఉండగా వారికి రూ.2,93,000 అపరాధ రుసుం, అదనపు లోడు వినియోగిస్తున్న 63 మంది వినియోగదారులకు రూ.3,06,700 అపరాధ రుసుం విధించినట్లు అధికారులు వెల్లడించారు. విజిలెన్స్ ఈఈ కేవీఎల్ఎస్ మూర్తి, గుంటూరు -2 ఈఈ సీహెచ్ రమేష్‌బాబు, చిలకలూరిపేట డీఈ ఆర్ ఆశోక్‌కుమార్, యడ్లపాడు ఏఈ కె సాంబశివరావు ఉన్నారు.

విడదల నిహారిక ఫౌండేషన్ సేవలు విలువైనవి

112 మంది పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

చిలకలూరిపేట: విడదల నిహారిక ఫౌండేషన్ సేవలు ఎంతో విలువైనవని రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి పీవీరావు చెప్పారు. విడదల నిహారిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీనివాసం ఫంక్షన్ హాలులో మంగళవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని 30 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన నిరుపేద విద్యార్థులు 112 మందికి ఉచితంగా సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తులెన్ని సంపాదించినా సమాజ సేవకు ఉపయోగించని ధనం వృథా అయినట్లేనని చెప్పారు. ప్రతి పౌరుడు కూడా పేబ్యాక్ టు సొసైటీ అనే సిద్ధాంతాన్ని ఆచరించాలని సూచించారు. తానా సభ్యుడైన విడదల శిఖేంద్రనాథ్ ప్రత్యేకంగా ఇక్కడికి వచ్చి తన సోదరి పేరుతో స్థాపించిన ట్రస్టు ద్వారా ఈ సమాజ సేవా కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త లంకా రఘురామిరెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు విడదల సాంబశివరావు, కార్యదర్శి విడదల కమలేంద్ర, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్ర ప్రసాద్, విడదల గోపీనాథ్, బత్తినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బాలికల సంరక్షణలో బాధ్యతగా మెలగాలి

నరసరావుపేట ఈస్ట్: బాలికల అభ్యున్నతి, సంరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతతో మెలగాలని జిల్లా ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ తెలిపారు. ఇంటర్నేషనల్ గాళ్ చైల్డ్ డే సందర్భంగా బుధవారం హార్ట్ జూనియర్ కళాశాలలో జిల్లా బాలికా సంరక్షణ, మహిళా శిశు సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు కేసిన కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పురుషులతో సమానంగా మహిళలకు అన్ని హక్కులు కల్పించారని తెలిపారు. బాలికలు తమ విద్యార్థి దశలోనే తమకు కల్పించిన హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించాలని సూచించారు. మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని తెలిపారు. కార్యక్రమంలో బాలిక సంరక్షణ అధికారి బి.విజయకుమార్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, దిశ ఎస్ఐ గౌతమి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ అరుణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ

ఎస్ ఎస్ అండ్ ఎన్ కళాశాలలో...

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో బాలిక సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రవి, లింగ నిర్ధారణ చట్టం నోడల్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ, బాలికలు లింగ అసమానతలకు గురికావటం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, అధ్యాపకులు డాక్టర్ పీఎస్‌వీడీ మహేష్, డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.